# ఇట్లయితే వాస్తవాలు తెలుస్తయా?

- కాంగ్రెస్ అభ్యర్థులపై 'కురియన్' అసహనం
- కూడబలుక్కున్నట్టు ఓడిన, గెలిచిన వారిది అదేమాట
- భయపడ్డారా..? అధినేతను కాపాడుతున్నారా?
- మంత్రిపదవులివ్వనందునే ఓడామన్న మల్‌రెడ్డి రంగారెడ్డి
- ఎంఐఎంతో దోస్తీ కొంపముంచిందన్న ఫిరోజ్‌ఖాన్
- పర్యటనను అర్ధంతరంగా ముగించిన కమిటీ

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలకు కారణాలు తెలుసుకునేందుకు వచ్చిన కురియన్ కమిటీ పర్యటన అర్ధంతరంగా ముగిసింది. మూడు రోజుల పర్యటనను రెండు రోజులకే కుదించుకొని శుక్రవారం తిరిగి వెళ్లిపోయింది. కమిటీకి నేతృత్వం వహించిన పీజే కురియన్ శుక్రవారం ఉదయం కేరళకు వెళ్లిపోగా, మిగతా ఇద్దరు సభ్యులు సాయంత్రం నాలుగు గంటల వరకు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ముందు హాజరైన ఓడిపోయిన ఎంపీ అభ్యర్థులు, గెలిచిన ఎంపీలు ఒకేలా రాసిచ్చిన స్క్రిప్ట్ మాదిరిగా బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ బీజేపీకి మళ్లడం వల్లనే ఓడిపోయామని చెప్పడం పట్ల కురియన్ పెదవి విరిచిన విషయం తెలిసిందే. 'ఇలా అయితే వాస్తవాలెలా బయటికి వస్తాయి. మమ్మల్ని కలువడానికి ముందు మీరంతా ఒకే విధంగా చెప్పాలని నిర్ణయించుకున్నారా? అని ఆయన అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. రెండో రోజు కూడా అవే కారణాలనే చెప్పినట్టు తెలిసింది. దీంతో ఇక ఫలితం లేదని భావించిన మిగతా ఇద్దరు సభ్యులు కూడా శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి తిరిగి వెళ్లిపోయారు. తమ నివేదికను ఈ నెల 21న అధిష్ఠానానికి అందించనున్నట్టు కురియన్ కమిటీ సభ్యుడు రికాబుల్ హసన్ మీడియాకు తెలిపారు. ఇంకా ఎవరైనా ఏమైనా చెప్పాలనుకుంటే ఫోన్ చేసి కానీ, రాతపూర్వకంగా గానీ పంపవచ్చని వారు సూచించినట్టు తెలిసింది. వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చినట్టు సమాచారం.

### అప్పుడు అలా చెప్పారు!

అధికారంలో ఉండి కూడా మెజార్టీ ఎంపీ సీట్లు గెలుచుకోకపోవడానికి అభ్యర్థుల ఎంపిక సరిగ్గా జరగలేదని, ఇతర పార్టీలకు చెందిన నేతలను ఎన్నికలకు ముందే పార్టీలో చేర్చుకొని బరిలోకి దించారని, నాలుగు చోట్ల బీజేపీ అభ్యర్థులు గెలిచే విధంగా బలహీనమైన అభ్యర్థులను ఎంపిక చేశారని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డిపై రాష్ట్ర నేతలు అధిష్ఠానానికి ఉప్పు అందించారు. ఇందులో నిజానిజాలను తేల్చేందుకే ఏఐసీసీ కురియన్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసి రాష్ట్రానికి పంపింది. కానీ కమిటీ ముందు హాజరైన వారంతా పై కారణాల్లో ఒక్కటీ చెప్పలేదు. దీంతో వారు రాష్ట్ర నాయకత్వానికి భయపడ్డారా? లేక తమ నాయకుడిని కాపాడుకున్నారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### పదవులు లేకపోవడమే కారణం: మల్‌రెడ్డి

ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని చేవెళ్ల, మల్కాజిగిరి, హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలువకపోవడానికి మంత్రివర్గంలో ఈ జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడమే కారణమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కమిటీకి వివరించినట్టు మీడియాకు తెలిపారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఇక్కడ ఎంపీ సీట్లు గెలువలేకపోయామని ఆయన వివరించారు.

### ఒప్పందమే కొంపముంచింది : ఫిరోజ్‌ఖాన్

పార్లమెంట్ ఎన్నికల్లో ఎంఐఎంతో కాంగ్రెస్ పార్టీ లోపాయకారి పొత్తు పెట్టుకోవడంతో హిందూ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గుచూపారని నాంపల్లి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన ఫిరోజ్‌ఖాన్.. భిన్నమైన వాదన వినిపించినట్టు తెలిసింది. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల, మెదక్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి ఇదే కారణమని ఆయన ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సూచన మేరకు హైదరాబాద్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని బరిలోకి దించిందని, తనకు అక్కడి నుంచి టికెట్ ఇచ్చి ఉంటే కచ్చితంగా గెలిచేవాడినని కూడా ఫిరోజ్‌ఖాన్ చెప్పినట్టు తెలిసింది.

## దానంపై అనర్హతకు మరో పిటిషన్

హైదరాబాద్, జూలై 12 ( నమస్తే తెలంగాణ): ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసే విధంగా స్పీకర్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. నిర్మల్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే ఏ మహేశ్వర్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన నాగేందర్, కడియం శ్రీహరి. తెల్లం వెంకటరావులపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లు హైకోర్టు విచారణలో ఉన్నాయి. తాజా పిటిషన్‌పై కూడా హైకోర్టు సోమవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది.

## కాంగ్రెస్‌లో చేరిన ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పీ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

## కార్పొరేషన్ చైర్మన్ల బాధ్యతలు..

రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లకు చైర్మన్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల కళాభవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతులు ఆమెకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్‌లో, రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల ఆర్థిక సహకార సంస్థ చైర్మన్‌గా ఎన్ ప్రీతమ్ మానసబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో బాధ్యతలు చేపట్టారు.

## సీఎం సారూ అన్యాయం చేస్తారా?

- గత రెండుసార్లు ఎంపికయ్యా.. ఈసారి కోల్పోయా
- మానసిక వ్యథతో లేఖ రాసిన నిరుద్యోగి కవిత

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ కోసం మూడుసార్లు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో రెండుసార్లు అర్హత సాధించా. ఈ ఏడాదిలో మూడోసారి నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించకపోవడంతో నాకు అన్యాయం జరిగింది. నా లాంటోళ్లకు అన్యాయం చేస్తారా' అని కవిత అనే ఓ నిరుద్యోగి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి, టీజీపీఎస్సీ సెక్రటరీకి ఆమె లేఖ రాసింది. పాత గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్ ద్వారా పరీక్ష పెట్టడం వల్లే తాను మెయిన్స్ జాబితాలో అవకాశం కోల్పోవాల్సి వచ్చింది.. అని కవిత ఆ లేఖలో పేర్కొన్నది. అయితే ఈ విషయంలో తమకు జరిగిన అన్యాయాన్ని పూడ్చడానికి మానవతా కోణంలో ఆలోచించి 1:100 నిష్పత్తిని పాటించాలని కోరుతున్నది. రెండున్నరేండ్లుగా తీవ్ర మానసిక వేదనతో ఉన్నా.. అందువల్లే మూడోసారి పరీక్షలో అర్హత సాధించలేకపోయా' అని ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. 'నాకు జీవితం పట్ల ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితులను తీసుకొచ్చిన ప్రభుత్వ పనితీరుకు నేను బలి కావాల్సి వస్తున్నది' అని పేర్కొన్నది. కనీసం మెయిన్స్ పరీక్షలు రాసి ఫెయిలైనా ఏదో సర్దిచెప్పుకునే వాళ్లమని, ఆ అవకాశం కూడా లేదు.. అని ఆవేదన వ్యక్తం చేసింది.

# దవాఖానకు బక్క జడ్సన్ తరలింపు

### ఆరోగ్యం క్షీణించడంతో స్పందించిన ఉద్యమకారులు

ముషీరాబాద్, జూలై 12: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం సాయంత్రం దవాఖానకు తరలించారు. కదలలేని స్థితికి చేరుకోవడంతో కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్ సహా పలువురు తెలంగాణ ఉద్యకారులు, నిరుద్యోగులు అంబులెన్స్‌ను రప్పించి తరలించేందుకు చొరవ తీసుకున్నారు. మొదట నల్లకుంట ఆంధ్ర మహిళాసభ, అక్కడి నుంచి నిమ్స్ దవాఖానకు తరలించారు. గోల్కొండ క్రాస్‌రోడ్‌లోని తన నివాసంలో బక్క జడ్సన్ వారం రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. శుక్రవారం జడ్సన్‌ను పరామర్శించడానికి వచ్చిన వేర్ హౌసింగ్ కార్పొరేషర్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్, పలువురు ఉద్యమకారులు ఆయన పరిస్థితిని చూసి చలించిపోయారు. వెంటనే దవాఖానకు తరలించారు.

### ఇంత దారుణమా?: రజినీ సాయిచంద్

ప్రజాపాలనలో ఇంత దారుణమా, ప్రభుత్వం బేషజాలకు పోయి జడ్సన్ దీక్షను నిర్లక్ష్యం చేసిందని రజినీ సాయిచంద్ మండిపడ్డారు. ఒకవైపు జడ్సన్ తనను దవాఖానకు తీసుకుపోవద్దని వారిస్తున్నా.. రజినీ సాయిచంద్ ఆయన ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా తరలించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా అపార్టుమెంటు బయట ఉన్న పోలీసుల ఎదుట ఆమె అసహనాన్ని వ్యక్తం చేశారు.

### నిమ్స్ దవాఖాన వద్ద ఉద్రిక్తం

ఖైరతాబాద్, జూలై 12: బక్క జడ్సన్‌ను చేర్చుకునేందుకు నిమ్స్ వైద్యులు తొలుత నిరాకరించారు. బెడ్లు ఖాళీ లేవని, చేర్చుకోవడం కుదరదని తేల్చిచెప్పారు. ఈ దశలో నిరుద్యోగులు, అభిమానులు, కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. వారి ఒత్తిడి మేరకు ఆయనను ఎమర్జెన్సీ వార్డులో చేర్చుకున్నారు. సుమారు 30 నిమిషాలకు పైగా జడ్సన్‌ను అంబులెన్స్‌లోనే ఉంచడంతో దవాఖాన బయట తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. అనంతరం వైద్యులు చేర్చుకోవడంతో ఆందోళనను విరమించారు. అంతకు ముందు వేర్వేరు దవాఖానలకు తరలించగా, బెడ్స్ లేవని జడ్సన్‌ను చేర్చుకోలేదు. ప్రస్తుతం జడ్సన్‌కు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నామని, ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు దవాఖాన ఆర్ఎంవో తెలిపారు.

జడ్సన్‌ను తరలిస్తున్న రజినీ, ఉద్యమకారులు

నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గురుకులంలో విద్యార్థులు పడుకునే గది

# ఎలుకల కలకలం

మొదటిపేజీ తరువాయి...

మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గురుకులంలోనూ విద్యార్థులను కరిచాయి. నర్సాపూర్ పట్టణ సమీపంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకులంలో విద్యనభ్యసిస్తున్న నలుగురిని శుక్రవారం ఎలుకలు కరిచాయని విద్యార్థులు తెలిపారు. ఈ విషయాన్ని బయటకు రాకుండా.. విద్యార్థులతో విలేకరులు మాట్లాడకుండా గురుకుల సిబ్బంది అడ్డుపడ్డారు. గదిలో చెత్తాచెదారం ఉండటంతో రోజూ ఎలుకలు వస్తున్నాయని కొందరు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు ఏఎన్ఎంతో ప్రథమ చికిత్స చేయించారని సమాచారం. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా.. అలాంటి సంఘటన ఏమీ జరగలేదని చెప్పడం విశేషం.

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రామాయంపేట సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో బాలికలను ఎలుకలు కొరికిన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్‌కు మెదక్ మాజీ ఎమ్మెల్యే పి శశిధర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. శుక్రవారం సచివాలయంలో శ్రీధర్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని, విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు.

# మహిళా సంఘాలకు గురుకులాల కిచెన్!

- బాధ్యతల అప్పగింతకు ప్రభుత్వం యోచన
- ముందుకొస్తే టెండర్లు లేకుండానే ఇచ్చేందుకు సిద్ధం
- శానిటేషన్ కోసం ఆర్సీవోల పరిధిలో రెస్యూ బృందాలు
- ఫిర్యాదుల కోసం ప్రతీ గురుకులంలో ఫోన్ ఏర్పాటు
- 20వ తేదీలోగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి: సెక్రటరీ వర్షిణి

హైదరాబాద్, జూలై12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గురుకులాల నిర్వహణ బాధ్యతను స్థానిక స్వయం సహాయక సంఘాలకు అప్పగించే దిశగా ప్రభుత్వం యోచిస్తున్నది. తొలుత తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్) పరిధిలోని గురుకులాల నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని భావిస్తున్నది. సొసైటీల పరిధిలో పరిశుభ్రత చర్యల కోసం ఆర్సీవోల పరిధిలో ప్రత్యేకంగా శానిటేషన్ రెస్యూ బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ విద్యార్థి హెల్త్ ప్రొఫైల్‌పైనా దృష్టి సారించనున్నారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి ఆయా వివరాలను వెల్లడించారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు, ఆ బాధ్యతలను స్థానిక సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు అప్పగించాలని యోచిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న మహిళా సంఘాలు ముందుకొస్తే గురుకులాల నిర్వహణ బాధ్యతను టెండర్లు లేకుండానే నేరుగా అప్పగిస్తామని తెలిపారు. గురుకుల విద్యార్థులకు అందించే కాస్మోటిక్స్ నిధులు, డైట్ బిల్లులను కూడా గ్రీన్ చానల్ పద్ధతిలో చెల్లిస్తామని తెలిపారు. శానిటేషన్ బృందంలో ప్లంబర్, ఎలక్ట్రీషియన్, పెస్ట్ కంట్రోల్ తదితర విభాగాలకు చెందిన నిపుణులు ఉంటారని తెలిపారు. ఆర్సీవో పరిధిలోని గురుకులాల్లో శానిటేషన్ పనులన్నీ ఆ బృందాలే పర్యవేక్షిస్తాయని వెల్లడించారు. గురుకుల విద్యార్థులు తమ సమస్యలను వివరించేందుకు సొసైటీ ప్రధాన కార్యాలయంతో అనుసంధానిస్తూ త్వరలోనే పైలట్ ప్రాజెక్టుగా 10 గురుకులాల్లో ఒక టెలిఫోన్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఆ తరువాత దానిని అన్ని గురుకులాలకు విస్తరిస్తామని తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశాల పక్రియను ఈ నెల 20లోగా పూర్తి చేయనున్నట్టు సెక్రటరీ వర్షిణి స్పష్టం చేశారు. 15 నుంచి 18 వరకు గురుకుల ప్రమోషన్ల ప్రక్రియ నిర్వహిస్తామని, ఆ తర్వాత 19-20వ తేదీల్లో కొత్తగా అపాయింట్‌మెంట్ అందుకున్న అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇస్తామని వెల్లడించారు. సమావేశంలో సొసైటీ అడిషనల్ సెక్రటరీ హన్మంత్‌నాయక్, జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

## నార్నూర్ గురుకులంలో 20మంది విద్యార్థులకు అస్వస్థత

**శ్వాస సంబంధిత సమస్యతో సతమతం • నలుగురి పరిస్థితి విషమం**

నార్నూర్, జూలై 12: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ, ఆదర్శ పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. శ్వాసకోస సమస్యతో ఇబ్బంది పడుతూ దవాఖాన పాలయ్యారు. గమనించిన ఉపాధ్యాయులు, సిబ్బంది వారిని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా సంఘాల, పార్టీల నాయకులు దవాఖానకు ఎదుట నిరసన తెలిపారు. స్టాఫ్ నర్సు సరికా విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. అందులో నలుగురు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండటంతో ఉట్నూర్ దవాఖానకు తరలించారు.

# హాస్టల్‌లో మేముండలేం!

- గోడ దూకి 19 మంది పరార్
- అర్ధరాత్రి కాలినడకన జనగామకు చేరుకున్న విద్యార్థులు
- పెంబర్తి మహాత్మాజ్యోతిబాపూలే హాస్టల్‌లో ఘటన

హాస్టల్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జనగామ రూరల్, జూలై 12: సీనియర్ విద్యార్థులు, ఉపాధ్యాయుల వేధింపులు భరించలేక కొందరు విద్యార్థులు అర్ధరాత్రి హాస్టల్ గోడదూకి పరారయ్యారు. ఈ ఘటన శుక్రవారం జనగామ జిల్లా జనగామ మండలం పెంబర్తిలోని మహాత్మాజ్యోతిబాపూలే హాస్టల్‌లో జరిగింది. ఇక్కడి హాస్టల్‌లో ఉంటున్న 19 మంది విద్యార్థులు.. వసతులు నచ్చక, సిబ్బంది వేధింపులు తట్టుకోలేక అర్ధరాత్రి హాస్టల్ గోడదూకి జనగామ ధర్మకంచలో ఉన్న పాత హాస్టల్‌కు సుమారు ఆరు కిలోమీటర్లు కాలినడకన చేరుకున్నారు. అర్ధరాత్రి విద్యార్థులు హాస్టల్ నుంచి వెళ్లిపోతే.. సిబ్బంది కనీసం సమాచారం ఇవ్వలేదని మధ్యాహ్నం ధర్మకంచలోని హాస్టల్ ఎదుట తల్లిదండ్రులు ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పెంబర్తిలోని జ్యోతిబాపూలే పాఠశాలలో సరైన సౌకర్యాలు లేవని, ఇక్కడ ఉండటానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. సీనియర్ విద్యార్థులు, టీచర్లు వేధిస్తున్నారని, సౌకర్యాలు లేవని అడిగితే ఇక్కడ ఇలాగే ఉంటుందని బెదిరిస్తున్నారని వాపోయారు. జనగామలోని ధర్మకంచ హాస్టల్‌లో సౌకర్యాలు ఉన్నాయని, ఇక్కడి నుంచి పెంబర్తి హాస్టల్‌కు మార్చారని పేర్కొన్నారు. గతంలో ఉన్న హాస్టల్‌లోనే ఉంటామని విద్యార్థులు నినాదాలు చేశారు. అధికారులు స్పందించి ధర్మకంచ హాస్టల్‌లో ఉండే విధంగా కృషి చేయాలని కోరారు. రాయలేని భాషలో ఉపాధ్యాయులు బూతులు తిడుతున్నారని చెప్పారు. పెంబర్తి హాస్టల్‌లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలున్నాయని ప్రిన్సిపాల్ అనిత పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగొద్దనే పెంబర్తిలో మరో బిల్డింగ్ అద్దెకు తీసుకున్నామని, బూతులు తిట్టే ఉపాధ్యాయులపై శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని ఆమె వివరించారు.

## పసికందు విక్రయం

**ముగ్గురు నిందితుల అరెస్ట్.. తండ్రే సూత్రధారి**

చార్మినార్, జూలై 12: కనికరం లేకుండా కన్నబిడ్డను అమ్మకానికి పెట్టాడో తండ్రి. హైదరాబాద్ బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ శుక్రవారం వివరాలను వెల్లడించారు. మొహమ్మద్ నగర్ వాసులైన ఆసిఫ్, అస్మాబేగం దంపతులకు ఇటీవలే ఓ పాప జన్మించింది. చిన్నారిని ఎలాగైనా అమ్మి సొమ్ము చేసుకోవాలని తండ్రి ఆసిఫ్ నిర్ణయించుకున్నాడు. అదే ప్రాంతానికి చెందిన చాంద్ సుల్తానాను సంప్రదించాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మినాల్ సాద్‌ను సంప్రదించి లక్ష రూపాయలకు ఆ పసికందును కొనేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అస్మాబేగంను భయపెట్టి చిన్నారిని మినాల్ సాద్‌కు ఆసిఫ్ అప్పగించాడు. జరిగిన ఉదంతంపై అస్మాబేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు చిన్నారిని రక్షించి నగరానికి తీసుకొచ్చారు. ఆసిఫ్, చాంద్ సుల్తానా, మినాల్‌సాద్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ పాయిజన్

పెద్దేముల్, జూలై 12: వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని కందనెల్లి తండా ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో 33 మంది విద్యార్థులు ఉండగా, శుక్రవారం 31 మంది హాజరయ్యారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పులిహోరను వడ్డించారు. 18 మందికి ఒక్కసారిగా కడుపు నొప్పి వచ్చి వాంతులయ్యాయి. విద్యార్థులకు తాండూరులోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో చికిత్సను అందించగా 14 మంది కోలుకున్నారు. నలుగురు విద్యార్థులు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఫుడ్ పాయిజనే అస్వస్థతకు కారణమని వైద్యులు తెలిపారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

## డీజీపీకి టీఎన్జీవోల శుభాకాంక్షలు

డీజీపీ జితేందర్‌కు టీఎన్జీవో కేంద్ర సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం లడ్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్, నగరశాఖ అధ్యక్షుడు శ్రీకాంత్, మల్లారెడ్డి, శ్రీనివాస్ కలిశారు. - హైదరాబాద్

## 'రైతుల సమస్యలు పరిష్కరించాలి'

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రైతుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర రైతు సంఘం కోరింది. శుక్రవారం ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని సచివాలయంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, సహాయ కార్యదర్శి శోభన్, సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలపై కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అంశాలకు ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని కోరారు.

## 'టీ-స్క్వేర్'కు టెండర్లు

**బిడ్లకు ఆగస్టు 9దాకా గడువు**

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రాయదుర్గం, బయోడైవర్సిటీ ప్రాంతాల్లో టీ-స్క్వేర్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తున్నది. బిడ్లకు ఆగస్టు 9 వరకు గడువు విధించింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఐఐసీ) ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం ఆర్కిటెక్చరల్, లావాదేవీల సలహాల సేవల కోసం టెండర్ల ప్రక్రియ ప్రారంభించింది. అమెరికాలోని న్యూయార్క్ సిటీలో ప్రఖ్యాతిగాంచిన టైమ్స్‌స్క్వేర్ తరహా టీ-స్క్వేర్ నిర్మించాలని యోచిస్తున్నది. హైదరాబాద్‌కు ఐకానిక్‌గా టీ-స్క్వేర్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నది.

## 'కులగణన బిల్లు కోసం ఢిల్లీ యాత్ర'

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వమే కులగణన చేపట్టాలని, ఈ మేరకు రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా బీసీ ఎంపీలంతా కృషి చేయాలని ఓబీసీ యూనియన్ జాతీయ అధ్యక్షుడు పురుషోత్తంగౌడ్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులగణన బిల్లు సాధనకు త్వరలో ఢిల్లీ యాత్ర చేపట్టనున్నట్టు వెల్లడించారు.

## అగ్నిమాపక శాఖ డైరెక్టర్‌గా జీవీ నారాయణరావు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన గుమ్మడి వెంకటనారాయణరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి ఇతర ఉన్నతాధికారులు వెంకటనారాయణరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## క్యాన్సర్ మందులపై అధిక ధరలు

**ఫార్మా కంపెనీపై కేసు నమోదు**

కరీంనగర్ విద్యానగర్, జూలై 12 : క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన డెకర్బ్ జాయిన్ 500 ఎంజీ 23 వాయల్స్‌పై ఎమ్మార్పీ కంటే అధిక ధర ఉన్నట్టు గుర్తించి సంబంధిత ఫార్మా కంపెనీపై కేసు నమోదు చేసినట్టు కరీంనగర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్ తెలిపారు. డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ (డీపీసీవో) ప్రకారం ఎమ్మార్పీ రూ.518 కాగా, వాటిపై రూ.1,250 ఉన్నట్టు గుర్తించారు. సాధారణ తనిఖ